## క్లుప్తంగా

### వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారికి పల్లకిసేవ నిర్వహించగా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### ఆటోను బైక్ ఢీకొని..

వెంకటాచలం: ఆటోను బైక్ ఢీకొని యువకుడు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి వద్ద శనివారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన వెంకటకృష్ణ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వస్తుండగా, సర్వేపల్లి కాలువ వద్ద ముందు వెళుతున్న ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణకు గాయాలు కాగా ప్రయాణికులు గమనించి చికిత్సనిమిత్తం అతనిని ఆటోలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు సంతాప సభ

బుచ్చిరెడ్డిపాళెం: కామ్రేడ్ జక్కా వెంకయ్య సతీమణి జక్కా పార్వతమ్మ సంతాప సభను మండలంలోని దామమడుగులో ఆదివారం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు శనివారం తెలిపారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళా వైజ్ఞానిక కేంద్రంలో సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించే ఈ సంతాప సభలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

### పేకాట స్థావరంపై దాడి

మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామంలో శుక్రవారం రాత్రి నెల్లూరు సెబ్ అధికారులు పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,800 నగదు, 5 సెల్‌ఫోన్లు, 104 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ నెల్లూరు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం నిందితులను మనుబోలు పోలీసులకు అప్పగించారు.

### స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నెల్లూరు(అర్బన్): పొగతోటలోని పలు స్కానింగ్ కేంద్రాలను అధికారులు శనివారం తనిఖీ చేశారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు డెమో అధికారి శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, తదితరులు తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లను తనిఖీ చేసిన అనంతరం శ్రీనివాసరావు మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాల్లో ఎంత మందికి స్కానింగ్‌లు చేశారు.. వారిలో గర్భిణులు ఎంత మంది, తదితర వివరాలతో కూడిన ఫారం – ఎఫ్‌ను జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి ప్రతి నెలా ఐదులోపు పంపాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు లేకుండా హాస్పిటళ్లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఐవీఎఫ్ కేంద్రాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### వ్యక్తికి కత్తిపోట్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సినిమా చూసేందుకు వచ్చిన వ్యక్తిపై కత్తితో దాడి చేసి నగదు దోచుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొండాయపాళెం గేట్ ప్రాంతానికి చెందిన మణిమాఘలింగం తన భార్య, పిల్లలతో కలిసి నగరంలోని కొత్తహాల్‌కు శుక్రవారం సాయంత్రం వచ్చారు. విరామ సమయంలో తినుబండారాలను కొనుగోలు చేసి పిల్లలకు ఇచ్చి, మంచినీరు తాగేందుకు బయటకొచ్చారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అగ్గిపెట్టె ఉందానని అడిగారు. తన వద్ద లేదని మణిమాఘలింగం చెప్తుండగా, మరో నలుగురు వచ్చి ప్యాంట్ జేబులోని రూ.2500 నగదును లాక్కునేందుకు యత్నించారు. ప్రతిఘటించిన మణిమాఘలింగంపై కత్తితో పొడిచి పరారయ్యారు. చికిత్స నిమిత్తం బాధితుడ్ని జీజీహెచ్‌కు భార్య, పిల్లలు తరలించారు. చిన్నబజార్ ఎస్సై హనీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బృందావనంలో నాటక ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ లేచింది మహిళా లోకం పేరిట వీధి నాటకాన్ని బృందావనంలో శనివారం ప్రదర్శించారు. అనంతరం కళాకారులను అభినందిస్తూ జ్ఞాపికలు, చీరలను అందజేశారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్‌తో వెలుగులు

- బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో రెండో సెంట్రల్ లైటింగ్
- రూ.2 కోట్ల నిధుల మంజూరు
- రోడ్డుకిరువైపులా ఆక్రమణల తొలగింపు
- సైడ్ కాలువల నిర్మాణం



సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి(ఫైల్)



రెండో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్న చెన్నూరు రోడ్డు



చెన్నూరు రోడ్డుకిరువైపులా ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలో రెండో సెంట్రల్ లైటింగ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే చెన్నూరు రోడ్డుకిరువైపులా ఆక్రమణలను తొలగించడంతోపాటు సైడ్ కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేశారు. గతంలో బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రధాన కూడలి వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై రూ.1.65 కోట్లతో కేఎం ఆస్పత్రి నుంచి పంచేడు రోడ్డు వరకు దాదాపు రూ.1.5 కిలోమీటర్ల మేర మొదటి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఏర్పాటు చేసిన ఏడాది లోపే బుచ్చిరెడ్డిపాళెంలో రెండో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులను మంజూరు చేయిస్తున్నారు.

### రెండో సెంట్రల్ లైటింగ్‌కు రూ.2 కోట్లు

తాజాగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో మరో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు(సీఎండీఎఫ్) నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెన్నూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి మలిదేవి కాలువ వరకు అక్కడ నుంచి డీఎల్ఎన్ఆర్ పాఠశాల వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకిరువైపులా ఆక్రమణలను తొలగించడంతోపాటు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ద్వారా మరో రూ.50 లక్షల నిధులను విడుదల చేసి ఆ నిధులతో సైడ్ కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఈ పనులను నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే సెంట్రల్ లైటింగ్ పనులు కూడా ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

#### శరవేగంగా అభివృద్ధి



బుచ్చిరెడ్డిపాళెంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏడాది సమయంలోనే రెండో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం సంతోషకరం. ఇప్పటికే రూ.1.65 కోట్లతో ఒక సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయగా, మరో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

– మోర్ల సుప్రజ, నగర పంచాయతీ చైర్‌పర్సన్

#### రూ.2 కోట్ల మంజూరు



బుచ్చిరెడ్డిపాళెంలో రెండో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ద్వారా వెలుగులు నిండనున్నాయి. మొదటి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.1.65 కోట్ల నిధులు మంజూరు కాగా, రెండో సెంట్రల్ లైటింగ్‌కు రూ.2 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే ఈ పనులకు శంకుస్థాపన జరిగింది.

– బిట్రగుంట ప్రమీలమ్మ, 16వ వార్డు కౌన్సిలర్

#### త్వరగా పనులు పూర్తి చేస్తాం



చెన్నూరు రోడ్డులో వైఎస్సార్ విగ్రహం నుంచి మలిదేవి కాలువ, అక్కడ నుంచి డీఎల్ఎన్ఆర్ పాఠశాల వరకు రెండో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో భాగంగా ఇప్పటికే ఆక్రమణలను తొలగించి నుడా ద్వారా మంజూరైన మరో రూ.50 లక్షల నిధులతో సైడ్‌కాలువలను నిర్మిస్తున్నాం. త్వరలోనే సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తాం.

– ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్

## నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు: వేసవి సమీపించిన నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త పనులేవీ ప్రారంభించవద్దన్నారు. ఇప్పటికే జరుగుతున్న పనులను మాత్రం యథావిధిగా కొనసాగించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, ఏఈలు ఎ.రమేష్, పి.సురేష్‌కుమార్, ఏపీఎం రుక్మిణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## విచక్షణా రహితంగా పురుగుమందులు వాడొద్దు



నార్తురాజుపాళెంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు: విచక్షణా రహితంగా పురుగుమందులు వాడొద్దని ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శత్రు, మిత్ర పురుగులను గుర్తించి అవసరమైన వరకే మందులు వినియోగించాలని తెలిపారు. అలాగే సామూహిక ఎలుకల నివారణ ద్వారా ఎలుకలను నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శివజ్ఞాన, రైతులు పాల్గొన్నారు.

## గ్రిగ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన గ్రిగ్స్ మెమోరియల్ క్రీడా పోటీల్లో పట్టణంలోని విజేత స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్ త్రోలో పి.నిషాల్ ప్రథమ స్థానంలో, హైజంప్‌లో లోకేష్ ద్వితీయస్థానంలో, జూనియర్స్ విభాగంలో శివ లాంగ్‌జంప్, హైజంప్‌లలో ద్వితీయస్థానం సాధించారు. బాలుర గేమ్స్‌లో టెన్నికాయిట్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో ద్వితీయస్థానం, రిలే ఈవెంట్‌లో తృతీయస్థానం కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల కరస్పాడెంట్ జి.కామాక్షి, హెచ్ఎం స్వప్నారెడ్డి విద్యార్థులను అభినందించారు.

## విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గ పరిధిలో జరిగిన గ్రిగ్స్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన మండలంలోని దామరమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల ఇందుకూరుపేట మండలం నరసాపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన గ్రిగ్స్ క్రీడా పోటీల్లో తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని, పలు క్రీడల్లో సత్తాచాటి దాదాపు 94 పతకాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నరసయ్యను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

### ‘విశ్వసాయి ఎస్సార్కే’లో సైన్స్ ఫెస్ట్

నెల్లూరు(టౌన్): మాగుంట లేఅవుట్లోని విశ్వసాయి ఎస్సార్కే ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ ఫెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ తిరుపాల్ హాజరయ్యారు. అనంతరం ఉచిత మెడికల్ క్యాంప్, లియో ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. విశ్వసాయి విద్యా సంస్థల చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

### పోటీ పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పోటీ పరీక్షల ప్రాముఖ్యతపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయానంద్‌కుమార్‌బాబు పోటీ పరీక్షల ప్రాముఖ్యతను, విద్యార్థులు ఎలా సిద్ధం కావాలో క్షుణ్ణంగా వివరించారు. ఈ సదస్సులో గ్రంథాలయ అధికారిణి డాక్టర్ సుధారాణి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

### విద్యా ప్రయోజనాలకే ట్యాబ్‌లను వాడాలి

మనుబోలు: విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను విద్యా ప్రయోజనాల మేరకే వాడాలని మండల బైజూస్ ట్యాబ్ నోడల్ అధికారి వసంతకుమారి సూచించారు. శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను దుర్వినియోగం చేయరాదన్నారు. ట్యాబ్‌లలో సినిమాలు, పాటలు ఇతరత్రా చూడడం సరికాదన్నారు. ట్యాబ్‌ల ద్వారా వినియోగించిన డేటాను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని తెలిపారు. ఇతర ప్రయోజనాలకు ట్యాబ్‌లను వినియోగించే విద్యార్థులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎంఈఓ శేషాద్రి వాసు ఉన్నారు.

### ఆకట్టుకున్న ప్రాజెక్ట్ నమూనాలు

కొడవలూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చింతచెలిక ఒవెల్–18 పాఠశాలలో శనివారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకొంది. పర్యావరణం, శక్తిఉత్పాదనలు, కృత్రిమ మేధస్సు, అంతరిక్షశాస్త్రం, వ్యవసాయం, ఆరోగ్యం తదితర అంశాలకు సంబంధించి విద్యార్థినీ, విద్యార్థులు రూపొందించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పులిమి హరిబాబురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.సునీత, ఇన్‌చార్జి సునీల్‌కుమార్‌యాదవ్, భార్గవ్, వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### వరిలో మానిపండు తెగులు

తోటపల్లిగూడూరు: ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంటను ఆశిస్తున్న మానిపండు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి గీతాకుమారి సూచించారు. మండలంలోని నరుకూరు గ్రామంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి పంటలో మానిపండు తెగులు అధికంగా ఉందన్నారు. మానిపండు తెగులుపై రైతులు ఏ మాత్రం అశ్రద్ధ చేసినా తీవ్రనష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకులు నిరీష, కావేరి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి




మాట్లాడుతున్న ఎంపీపీ వజ్రమ్మ

మనుబోలు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎంపీపీ గుండాల వజ్రమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నారు. బండేపల్లి సర్పంచ్ ఆవుల వెంకటరమణయ్య మాట్లాడుతూ తమ గ్రామానికి పంచాయతీ భవనం మంజూరు చేయించాలని కోరారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరును వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఏఈలు రవికుమార్, కార్తీక్‌రెడ్డి, చంద్రశేఖర్, ఏఓ జహీర్, ఏపీఎం వనజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక స్వావలంబన ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న పీడీ కేవీ సాంబశివరావు

- పీడీ సాంబశివారెడ్డి

ఇందుకూరుపేట: మహిళలను ఆర్థిక స్వావలంబనతో మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో శనివారం వైఎస్సార్ క్రాంతిపథం క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలను మరింత పటిష్టపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఒక్కో గ్రూపు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆ రుణాన్ని ఏ విధంగా జీవనోపాధికి వినియోగిస్తున్నారనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరేలా చూడాలని సూచించారు. బ్యాంకు, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి రికవరీ, పుస్తకాల నిర్వహణ తదితరాలపై పీడీ సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ టీఆర్‌డీడీ రాజు, డీపీఎం రవికుమార్, స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్, ఏసీ కె.శ్రీనివాసులు, ఏపీఎం ఎస్.రవిశంకర్‌రెడ్డి, నెల్లూరు ఏరియాలోని ఆరు మండలాల పరిధిలో ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

## దంతాల సంరక్షణపై జాగ్రత్తలు అవసరం



విద్యార్థినికి పేస్ట్, బ్రష్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం తదితరులు

కొడవలూరు: దంతాల సంరక్షణపై జాగ్రత్తలు అవసరమని వైఎస్సార్ చిరునవ్వు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.నాగేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చంద్రశేఖరపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో దంతాల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరమని, అతి వేడి లేదా అతి చల్లని పదార్థాలను తీసుకొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో దంతాలపై ఎనామిల్ దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. చిగుళ్లు అతి సున్నితమైనవి కనుక రెండు నిమిషాల కన్నా ఎక్కువ సేపు పళ్లు తోమరాదన్నారు. పొగాకుతో కూడిన సిగరెట్, బీడీ, ఖైనీ, గుట్కాలు వాడడం వల్ల నోటి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చిన్న పిల్లలు చాక్లెట్ వంటి తీపి పదార్థాలను తిన్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దేగా మురళీమోహన్‌రావు, కార్యక్రమ సమన్వయకర్త పి.కావ్య, ఉపాధ్యాయులు శివకుమార్, పెంచలయ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో సత్తాచాటిన డీఎస్సార్ విద్యార్థులు



క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గ్రిగ్స్ మెమోరియల్ క్రీడా పోటీల్లో సత్తాచాటారు. సర్వేపల్లి జోన్ పరిధిలో ఇదే పాఠశాలలో మూడు రోజుల పాటు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఫుట్‌బాల్, హాకీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు సత్తాచాటారు. సీనియర్స్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.రవీంద్ర కైవశం చేసుకున్నాడు. సీనియర్స్ బాలుర చాంపియన్‌షిప్‌ను, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మహ్మదాపురం డీఎస్సార్ స్కూల్ విద్యార్థులు కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం సీహెచ్ రామకృష్ణ శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ విజయ్‌విశ్వేశ్వరన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టైలర్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని టైలర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. టైలర్ల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడంపై కృతజ్ఞతలను తెలియజేశారు. 45 ఏళ్లు దాటిన వారికి పింఛన్‌ను ఇవ్వాలని, కుటుంబాలకు గృహ వసతిని కల్పించాలని కోరారు. టైలర్స్ డేను పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు యానాదయ్య, మదార్, మురళీకృష్ణ, సుందరం, యస్దానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

## నిందితుల కోసం ముమ్మర గాలింపు




సీసీ కెమెరాలో నమోదైన నిందితుల ఆనవాళ్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలో శుక్రవారం రాత్రి జరిగిన హత్య కేసులో విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. వైఎస్సార్‌నగర్‌కు చెందిన మహేష్ (23)ను కత్తులు, తల్వార్లతో అతి కిరాతకంగా ఏడుగురు పొడిచి హత్య చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఘటన స్థలానికి చేరుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు హత్య చేసి పరారవుతున్న దృశ్యాలు కెమెరాల్లో నమోదయ్యాయి. దీని ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందర్ని గుర్తించారని సమాచారం. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలను చేపట్టారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. హత్యలో ప్రధాన నిందితుడు చింటూ అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం మహేష్ తన స్నేహితులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా, చింటూ వచ్చి.. మహేష్, అతని తల్లిపై అసభ్యకరంగా మాట్లాడారని తెలిసింది. దీంతో మహేష్ ఆగ్రహానికి గురై చింటూపై దాడి చేశారని, అప్పటి నుంచి అతడ్ని ఎలాగైనా అంతమొందించాలని చింటూ నిర్ణయించుకున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో కత్తులతో మహేష్ కడుపు, వీపుపై దారుణంగా పొడిచారు. దీంతో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.